సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 6 । ఏప్రిల్ । 2025



శబరి మాత ఆశ్రమంలో..

తాడ్వాయిలోని శబరి మాత ఆశ్రమంలో శనివారం మహాచండి హోమాన్ని వైభవంగా నిర్వహించారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
37.3 /20.8

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం వాతావరణంలో తేమ తక్కువగా ఉంటుంది. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నీటి దుర్వినియోగం.. నలుగురిపై కేసులు

కామారెడ్డి క్రైం: మిషన్ భగీరథ నీటిని దుర్వినియోగం చేస్తుండడంతో నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ రాజేశ్ శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పది రోజుల క్రితం లింగంపేట మండలంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ పగలగొట్టి వ్యవసాయ అవసరాలకు నీటిని మళ్లించిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని పోచారం తండాలో ఒకరిపై, శనివారం పిట్లం మండలంలోని చిన్నకొడపగల్‌లో ఓ వ్యక్తిపై కేసులు పెట్టామని తెలిపారు. ఎవరైనా మిషన్ భగీరథ నీటిని దారి మళ్లించి వ్యవసాయ అవసరాలకు గాని, ఇతర అవసరాలకు గాని వినియోగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'సనాతన ధర్మాన్ని పరిరక్షించాలి'



మాట్లాడుతున్న జగన్మోహన శర్మ

కామారెడ్డి టౌన్: సనాతన ధర్మాన్ని పరిరక్షించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు జగన్మోహన శర్మ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని త్రిశక్తి దేవాలయంలో బ్రాహ్మణ సమాఖ్య జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేవాలయాలు, పూజారులపై దాడులు జరగకుండా ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకురావాలని కోరారు. రాష్ట్ర బ్రాహ్మణ పరిషత్ చైర్మన్‌గా జగన్మోహన శర్మను నియమించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామేశ్వర శర్మ తెలిపారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస శర్మ, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వీణావాణి, సభ్యులు సతీష్, అర్జునరావు, రాజేంద్రప్రసాద్, ప్రదీప్, కిషన్ రావు, సునీత తదితరులు పాల్గొన్నారు.

రేపు బీఎస్ఎన్ఎల్ సేవా శిబిరం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ రోడ్‌లోగల బీఎస్ఎన్ఎల్ సంస్థ కార్యాలయంలో సోమవారం వినియోగదారుల సేవా శిబిరం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సంస్థ డీఈ సురేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏవైనా ఫిర్యాదులు, బిల్లులకు సంబంధించిన సమస్యలు, ఇతర సేవలపై సలహాలు, సూచనలకోసం శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

'హామీలను అమలు చేయాలి'



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాలలో టీపీటీఎఫ్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు బకాయి పడిన నాలుగు డీఏలను విడుదల చేయాలని, 2023 జూలై నుంచి అమలు చేయాల్సిన పీఆర్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చింతల లింగం, ఉపాధ్యక్షులు నాగభూషణం, నళినీదేవి, కార్యదర్శి లక్ష్మి, నాయకులు నరేందర్, ప్రకాష్, శ్రీనివాస్, నారాయణ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైన్ షాపులు బంద్

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లాలోని వైన్ షాపులు, కల్లు దుకాణాలు, బార్లను ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా మూసివేయాలని సీపీ పోతరాజు సాయిచైతన్య శనివారం ఓ ప్రకటనలో ఆదేశించారు. ఆదివారం ఉదయం 6 నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు మూసి ఉంచాలని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించి దుకాణాలు తెరిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రారండోయ్ వేడుక చూద్దాం

శ్రీరామ నవమి వేడుకలకు జిల్లా ముస్తాబయ్యింది. ఆదివారం సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించేందుకు భక్తులు ఏర్పాట్లు చేశారు. పల్లె, పట్నం తేడా లేకుండా అన్నిచోట్ల వేడుకలు జరుగనున్నాయి.





గౌరారంలోని సీతారామాంజనేయస్వామి ఆలయం

గౌరారం సీతారామాంజనేయ ఆలయం

గాంధారి మండలంలోని గౌరారం గ్రామంలో ఉన్న సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ఐదు వందల ఏళ్లుగా అఖండదీపం వెలుగుతూనే ఉంది. ఏటా శ్రీరామనవమి సందర్భంగా ఇక్కడ ఉత్సవాలు పెద్ద ఎత్తున జరుగుతాయి. స్వామివారి కల్యాణోత్సవం, రథోత్సవం, కుస్తీ పోటీలు వంటివి నిర్వహిస్తారు. భక్తులకు అన్నదానం చేస్తారు. ఊరు ఊరంతా వేడుకల్లో పాల్గొంటుంది. దేవాలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ, కుల పెద్దలందరూ ఉత్సవాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

700 ఏళ్లనాటి ఆలయంలో..

బీబీపేట : యాడారం గ్రామంలోగల సీతారామాలయంలో ఏటా స్వామి వారి కల్యాణోత్సవం కమనీయంగా సాగుతుంది. ఈ ఆలయాన్ని 700 ఏళ్ల క్రితం నిర్మించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రెండో పురాతన రామాలయంగా ఇది ప్రసిద్ధికెక్కింది. 1324 సంవత్సరంలో కూడవెల్లి వాగు సమీపంలో ఈ ఆలయాన్ని నిర్మించినట్లు స్థలపురాణం చెబుతోంది. ప్రతి ఉదయం స్వామి వారి పాదాలను సూర్య కిరణాలు తాకడం ఈ ఆలయ విశేషం. గుడి నిర్మించినప్పుడు ఏర్పాటు చేసిన గంట ఇప్పటికీ ఉంది. శ్రీరామనవమి సందర్భంగా ఏటా ఐదు రోజులపాటు ఈ ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయి. ఏటా వివిధ సందర్భాలలో ఏడు సార్లు స్వామివారి విగ్రహాలతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం ఉదయం సీతారాముల ఎదుర్కోళ్లు నిర్వహిస్తారు. అనంతరం కల్యాణోత్సవం జరిపిస్తారు. గ్రామస్తులందరూ ఉత్సవాలలో పాల్గొంటారు.



యాడారంలోని ఏడు వందల ఏళ్లనాటి రామాలయం

నేడు శ్రీరామ నవమి

- ఉత్సవాలకు ముస్తాబైన ఆలయాలు
- ఊరూరా శ్రీసీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : శ్రీరామనవమి వేడుకల కోసం రామాలయాలతో పాటు హనుమాన్ ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆదివారం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహిస్తారు. కామారెడ్డిలోని పలు ఆలయాల్లో వేడుకలు జరుగుతాయి. దోమకొండ మండల కేంద్రంలోని రాం మందిర్, మాచారెడ్డి మండలంలోని పోలోనిపల్లి రామాలయం, బీబీపేట మండలంలోని యాడారం రామాలయం, రామారెడ్డి మండల కేంద్రంలోని రామాలయం, లింగంపేటలోని రామాలయం, నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటలోని రామాలయం, బీర్కూర్ మండలం తిర్మలాపూర్‌లోని రామాలయం... ఇలా జిల్లావ్యాప్తంగా ఉన్న ఆలయాలలో వేడుకల కోసం ఏర్పాట్లు చేశారు.

సండే స్పెషల్

నాలుగు శతాబ్దాల చరిత్ర..



లింగంపేటలోని రామాలయం

లింగంపేట: మండల కేంద్రంలోని రామాలయానికి సుమారు నాలుగు వందల ఏళ్ల చరిత్ర ఉంది. ఈ ఆలయాన్ని గతంలో హరిహరనాథ దేవాలయంగా వ్యవహరించేవారు. ఆలయాన్ని రాతితో నిర్మించారు. ఆలయ ప్రాంగణంలో పలు ఉప ఆలయాలున్నాయి. రామాలయానికి రాతితో కట్టిన ముఖద్వారం, మంటపం, విశాలమైన ఏకశిలా గోపురం ఉన్నాయి. కాలక్రమేణా ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో మండల కేంద్రానికి చెందిన గుండ రామలింగం గుప్తా అనే భక్తుడు రెండు దశాబ్దాల క్రితం ఆలయాన్ని పునర్నిర్మించారు. ఆయన ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలు జరిగేవి. ప్రస్తుతం ఆయన తనయుడు విజయ్‌కుమార్ గుప్తా ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నారు. ఏటా వారం పాటు శ్రీరామనవమి వేడుకలు సాగుతాయి. ప్రజలు భారీ సంఖ్యలో ఉత్సవాలలో పాల్గొంటారు.

సుమారు మూడు దశాబ్దాలుగా..

నాగిరెడ్డిపేట: గోపాల్‌పేటలోని శ్రీకోదండ రామాలయం ఉత్సవాలకు ముస్తాబయ్యింది. 29 ఏళ్లుగా ఆలయ ధర్మకర్త అంజయ్య ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవాలు జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం దేవతామూర్తుల విగ్రహాలను ఆలయ ధర్మకర్త ఇంటి నుంచి ఊరేగింపుగా ఆలయానికి తీసుకువస్తారు. అనంతరం ఆలయంలో కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ వేడుకను తిలకించడానికి మండలంలోని వివిధ గ్రామాలనుచి అధికసంఖ్యలో భక్తులు తరలివస్తారు.



కొలువుదీరిన దేవతామూర్తులు

ఉత్సవాలకు ముస్తాబైన కోదండ రామాలయం

రామ దీక్షలు ప్రత్యేకం

బాన్సువాడ : బాన్సువాడ మండలంలోని తిర్మలాపూర్‌లో 28 ఏళ్లుగా సీతారాముల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహిస్తున్నారు. బాన్సువాడ చుట్టుపక్కల ఎక్కడా లేని విధంగా ఈ గ్రామంలో ప్రజలు రామ దీక్షలు స్వీకరిస్తారు. ఉగాది రోజున దీక్ష ప్రారంభమవుతుంది. శ్రీరామనవమి తర్వాత దీక్షలు విరమిస్తారు. బీర్కూర్‌లోని కోదండ రామాలయంలోనూ శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి.



తిర్మలాపూర్‌లో ముస్తాబైన రామాలయం

దౌల్తాపూర్‌ను వణికిస్తున్న విషజ్వరాలు



జ్వరంతో బాధపడుతున్న మహిళ



బిచ్కుంద ఆస్పత్రిలో వైద్యుడు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ

- పక్షం రోజులుగా జ్వరం, ఒళ్లు నొప్పులతో ప్రజలు
- ఆస్పత్రిలో అందుబాటులో లేని వైద్యులు

బిచ్కుంద : దౌల్తాపూర్‌లో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. పలువురు చలి జ్వరంతోపాటు ఒంటి, కీళ్ల నొప్పులు, తలనొప్పితో బాధపడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. దౌల్తాపూర్ గ్రామ జనాభా 300. సుమారు 30 మంది జ్వరాలతో బాధపడుతున్నారు. కొందరికి రక్తంలో ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గినట్లు తెలుస్తోంది. ఏ వ్యాధి ఉందో తెలియక కొందరు భయపడి గ్రామాన్ని వదిలేసి బంధువుల ఇళ్లకు వెళ్తున్నారు. ప్రజలు అనారోగ్యం బారినపడ్డారని తెలిసినా అధికారులు గ్రామంవైపు చూడడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేరుకే వంద పడకల ఆస్పత్రి...

బిచ్కుంద ప్రభుత్వ ఆస్పత్రిని 30 పడకల నుంచి 100పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. 100 పడకల ఆస్పత్రిలో ఒక్క వైద్యుడు కూడా లేకపోవడం గమనార్హం. ఇన్‌చార్జి వైద్యుడు వారంలో రెండు మూడు రోజులు వచ్చి వెళ్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. ఆ డాక్టర్ ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి ఉంది. ఫార్మసిస్టు కూడా అంతే.. ఎవరైనా జ్వరంతో వస్తే ఆస్పత్రి పారిశుధ్య కార్మికులు రెండు పారాసెటమాల్ మాత్రలు ఇచ్చి పంపిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యం కోసం మహారాష్ట్రలోని దెగ్లూర్‌కు వెళ్లాలని సిబ్బంది సూచిస్తున్నారని పేర్కొంటున్నారు. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకునే ఆర్థిక స్తోమత లేనివారు స్థానికంగా ఆర్‌ఎంపీల వద్ద వైద్యం చేయించుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, గ్రామంతో వైద్య శిబిరం ఏర్పాటు చేయించాలని కోరుతున్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

కామారెడ్డి టౌన్: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కార్యక్రమంలో పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి రజిత, ఆర్డీవో వీణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, వివిధ కుల సంఘాల నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ఈజీ మనీ కోసం.. జీవితాలతో జూదం

- సదాశివనగర్‌కు చెందిన నిమ్మలబోయిన సందీప్ (29) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. క్రెడిట్ కార్డు, లోన్‌యాప్స్ ద్వారా అప్పులు తీసుకుని షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టాడు. నష్టాలు రావడంతో పాటు లోన్ యాప్స్ నిర్వాహకుల వేధింపులు పెరిగాయి. దీంతో మనస్తాపం చెందిన అతడు ఇటీవల తాను నివాసం ఉండే ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.
- దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామానికి సజిత్‌రెడ్డి (30) పంచాయితీ కార్యదర్శిగా పనిచేసేవాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌ల ఊబిలో కూరుకుపోయి అప్పులపాలయ్యాడు. కొద్ది రోజుల క్రితం తాను పని చేసే గ్రామానికి చెందిన నర్సరీలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.
- కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లికి చెందిన దేవల సంజయ్ (26) ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. దాదాపు రూ.కోటికి పైగా అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం తెలియక ఫిబ్రవరి 17 న ఆత్మహత్య చేసుకున్నాడు.
- కామారెడ్డి బల్దియా పరిధిలోని దేవునిపల్లికి చెందిన ఆకుల రాకేష్ (24) ఆన్‌లైన్ గేమ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడి రూ.15 లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. వాటిని తీర్చలేక గతేడాది సెప్టెంబర్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు.

- బెట్టింగ్, లోన్ యాప్స్ ఊబిలో కూరుకుపోతున్న యువత
- అప్పులు తీర్చే దారి తెలియక అర్ధంతరంగా తనువు చాలిస్తున్న పలువురు



కామారెడ్డి క్రైం : బెట్టింగ్ యాప్స్, లోన్ యాప్స్ సామాన్యులను పట్టి పీడిస్తున్నాయి. ముఖ్యంగా యువత ఈ ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, లోన్ యాప్‌ల బారిన పడి విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. అప్పులు తీర్చే మార్గం తెలియక మానసిక క్షోభకు గురవుతూ చివరికి ఆత్మహత్యలవైపు అడుగులు వేస్తున్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని భవిష్యత్తును తీర్చిదిద్దుకునేందుకు ఉపయోగించాల్సి ఉండగా ఎంతో మంది యువత తప్పుడు మార్గంలో ఉపయోగిస్తూ సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు. ఈజీ మనీకోసం తప్పుడు దారులు వెతుకుతున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. డబ్బులు అవసరం ఉన్నప్పుడు లోన్‌యాప్‌లను ఆశ్రయిస్తున్నారు. బెట్టింగ్‌లో డబ్బులు పోయి, లోన్ యాప్‌ల ఊబిలో కూరుకుపోయి ఏం చేయాలో తెలియని స్థితిలో ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో చాలా చోట్ల వెలుగు చూశాయి. కామారెడ్డి, బాన్సువాడ పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా వందల సంఖ్యలో లోన్‌యాప్స్ బాధితులు ఉన్నారు. పెద్ద మొత్తంలో నష్టపోయిన వారు పలువురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇటీవల లోన్ యాప్స్ ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్య చేసుకున్న సదాశివనగర్‌కు చెందిన సందీప్ ఇంటికి పెద్ద కొడుకు. అతడిపై ఆధారపడి తల్లిదండ్రులతో పాటు చదువుకుంటున్న చెల్లెలు, తమ్ముడు ఉన్నారు. అతడికి ఐదు నెలల క్రితమే వివాహమైంది. సందీప్ మృతితో ఆ కుటుంబం దాదాపు వీధిన పడినట్లయ్యింది.

అవగాహన కల్పిస్తున్నా...

లోన్ యాప్‌లు, బెట్టింగ్ యాప్‌లపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బెట్టింగ్ జోలికి వెళ్లవద్దని సూచిస్తున్నారు. అయినా కూడా పలువురు బెట్టింగ్ కాస్తూనే ఉన్నారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని పట్టణాలు, గ్రామాల్లో బెట్టింగ్‌కు అలవాటు పడినవారు వేల సంఖ్యలో ఉన్నారు. బెట్టింగ్, లోన్ యాప్‌లకు వ్యతిరేకంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మరింతగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- పంటను చూస్తే కన్నీళ్లు వస్తున్నాయి
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు


వాజిద్‌నగర్‌లో పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బిచ్కుంద(జుక్కల్): పంట నష్టపోయిన రైతులకు ఆదుకుంటామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. పంటను చూస్తే కన్నీళ్లు వస్తున్నాయని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వాజిద్‌నగర్, పుల్కల్, గుండెనెమ్లి ఆయా గ్రామాలలో అకాల వర్షంతో నష్టపోయిన వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు సర్వే చేసి నివేదిక అందించాలని సూచించారు. సమస్యను సీఎం, వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందే విధంగా చూస్తానని రైతులకు హామీ ఇచ్చారు.

సన్నబియ్యం పంపిణీ ...

దేశంలో ఎక్కడ లేని విధంగా రేషన్ షాపు ద్వారా పేదలకు సన్న బియ్యం పంపిణీ మన రాష్ట్రంలోనే ఉందని ఎమ్మెల్యే అన్నారు. బందారెంజల్‌లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం శెట్లూర్, ఖద్గాం, బందారెంజల్‌లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు విఠల్‌రెడ్డి, నాగ్‌నాథ్, వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగ్‌నాథ్ పటేల్, గంగాధర్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

మాచారెడ్డి: గజ్యానాయక్ తండాకు చెందిన ఓ యువకుడు శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గజ్యానాయక్ తండాకు చెందిన బెస్త ధర్మపురి (35) భార్య కొంతకాలంగా కాపురానికి రావడం లేదు. దీంతో మద్యానికి బానిసయ్యాడు. భార్య కాపురానికి రావడం లేదనే మనస్తాపానికి గురైన ధర్మపురి శనివారం రాత్రి వాటర్ ట్యాంక్ మెట్లకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.


కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని రాంమందిర్‌లో సీతారామ లక్ష్మణుల విగ్రహాలు


మాచారెడ్డి: అక్కాపూర్‌లో ముస్తాబైన ఆలయం


నిజాంసాగర్: అచ్చంపేటలో సీతారాముల విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు సంజీవ్‌రావ్‌శర్మ

రాములోరి పెళ్లికి ఆలయాలు ముస్తాబు


ఎల్లారెడ్డిలో ముస్తాబైన రామాలయం


జిల్లా కేంద్రంలోని ఆలయాన్ని ముస్తాబు చేస్తున్న యువకులు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లా వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలకు రామాలయాలు ముస్తాబు అయ్యాయి.ఈమేరకు ఆలయాల కమిటీ తరుపున అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకున్నారు. వేసవికాలం కావడంతో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. 15వ శతాబ్దంలో కామినేని వంశస్తులైన రామిరెడ్డి దోమకొండ కేంద్రంగా పరిపాలన సాగించారు. ప్రస్తుత రామారెడ్డి గ్రామ శివారులోని దేవరాళ్ల ప్రాంతంలో రామిరెడ్డి బస చేసిన చోట ఇక్కడే శ్రీరాముడు కొలువయ్యాడని రామిరెడ్డికి కల పడుతుంది. రామిరెడ్డి తన పేరు మీదుగా స్వయంభువుగా వెలిసిన శ్రీరాముడికి ఆలయం నిర్మించాడని చరిత్ర చెబుతుంది. శ్రీరాముడి ఆలయ చరిత్ర విలాపమనే గ్రంథంలో రామారెడ్డి చరిత్ర నిక్షిప్తమయిందని గ్రామస్తులు చెబుతున్నారు. మాచారెడ్డి మండలం పోలంపల్లి శాంతానంద తపోవనాశ్రమంలో గత 40ఏళ్లుగా శ్రీరామ నవమి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త రాజమౌళి గుప్తా తెలిపారు. శ్రీరామ నవమి సందర్భంగా కామారెడ్డి పట్టణంలోని రామారెడ్డి రోడ్డులోని ఇస్కాన్ కేంద్రంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రతినిధి వెంకటదాసు ప్రభు తెలిపారు.


దోమకొండ: విగ్రహాలను ముస్తాబు చేస్తున్న అర్చకులు రామకృష్ణశర్మ


ముస్తాబైన రామారెడ్డి శ్రీరామచంద్ర ఆలయం


కామారెడ్డి రూరల్: చిన్నమల్లారెడ్డిలో..

అదుపుతప్పిన బైక్.. ఒకరి మృతి


సంతోష్ మృతదేహం

నస్రుల్లాబాద్(బాన్సువాడ): ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మైలారం గ్రామంలో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద శనివారం చోటు చేసుకుంది. ఎస్సై లావణ్య తెలిపిన వివరాల ప్రకారం.. బీర్కూర్ మండలం సంభాపూర్ గ్రామానికి చెందిన గైక్వాడ్ సంతోష్(36) మేస్త్రీ పని చేస్తుంటాడు. శనివారం ఉదయం పని నిమిత్తం సంతోష్, సుభాష్ ఇద్దరూ బీర్కూర్ నుంచి నస్రుల్లాబాద్‌కు బైక్‌పై వెళ్తున్నారు. సుభాష్ అతివేగంగా నడపడంతో బైక్ అదుపుతప్పి వెనకాల ఉన్న సంతోష్ కిందపడ్డాడు. స్థానికులు 108 అంబులెన్స్‌లో ఏరియా ఆస్పత్రికి తరలించగా, సంతోష్ అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ తెలిపారన్నారు. భార్య సురేఖ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మైలారంలో ఒకరి ఆత్మహత్య

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని మైలారం గ్రామానికి చెందిన దూళి గంగారాం (65) శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. గంగారాంకు ఇద్దరు కుమారులు కాగా, భార్యతో కలిసి ఇంటిపైన రేకుల గదిలో నివాసముంటున్నాడు. రాత్రి ఇంట్లో భార్య లేని సమయంలో ఉరేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.


రోడ్డుపై ప్రమాదకరంగా గుంత

అటెన్షన్ ప్లీజ్..



దోమకొండ: మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయం ఎదురుగా ప్రధాన రహదారిపై ఇటీవల కురిసిన భారీ వర్షానికి పెద్ద గుంత ఏర్పడింది. ప్రతి నిత్యం మండల కేంద్రం నుంచి కామారెడ్డి వైపు, ఇటు బీబీపేట మండలం వైపు వందలాది వాహనాలు ఈ రోడ్డుపై వెళ్తుంటాయి. ప్రధాన రహదారికి తోడు ఇక్కడ మూల మలుపు ఉండటంతో వాహనదారులకు దగ్గరకు వచ్చే వరకు గుంత ఉన్న విషయం తెలియదు. దీంతో ప్రమాదాలు జరుగడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. గతంలో బీటీరోడ్డు కింద ఇటునుంచి రోడ్డుకు అవతలివైపు విశ్రాంత ఉపాధ్యాయుల భవనం వైపుకు కల్వర్టును నిర్మించారు. వర్షానికి కల్వర్టు భాగం దెబ్బతిని గుంత ఏర్పడిందని కాలనీవాసులు తెలిపారు. పంచాయతీ కార్యాలయ సిబ్బంది వెంటనే స్పందించి గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతన్నారు.

సీసీ రోడ్లు వేశారు.. క్యూరింగ్ మరిచారు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలో సీసీ రోడ్ల నిర్మాణంలో గుత్తేదారులు నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. మండల కేంద్రానికి రూ. 25లక్షలు మంజూరు కాగా సీసీ పనుల నిర్మాణం పూర్తయింది. వేసిన సీసీ రోడ్లకు వాటర్ క్యూరింగ్ సక్రమంగా చేయకపోవడంతో రోడ్లు బీటలు వారుతున్నాయి. రోడ్ల నిర్మాణం చేపట్టేటప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఇష్టారీతిన పనులు సాగుతున్నాయనే ఆరోపణలున్నాయి.

యువకుడి అదృశ్యం

మాచారెడ్డి: ఒంగోలు జిల్లాకు చెందిన రాయినూతల సుధాకర్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై అనిల్ తెలిపారు. సుధాకర్ కొద్ది రోజులుగా కిష్టయ్య అనే మేస్త్రీ వద్ద పని చేస్తూ మండలంలోని ఘన్‌పూర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈనెల 3న బయటకు వెళ్లిన సుధాకర్ ఇటు ఘన్‌పూర్, అటు తన సొంతూరుకు వెళ్లలేదు. దీంతో మేస్త్రీ కిష్టయ్య శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెడతా

డిచ్‌పల్లి: అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాన్ని జిల్లాలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి పేర్కొన్నారు. డిచ్‌పల్లి మండలంలోని కొరట్‌పల్లి తండా, కొరట్‌పల్లి, సుద్దులం, యానంపల్లి, సాంపల్లి, సుద్దపల్లి గ్రామాల్లో రూ.12.50 కోట్ల నిధులతో శనివారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అప్పటి సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పులపాలు చేశారని విమర్శించారు. వాటికి నెలానెలా వడ్డీ చెల్లిస్తూనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రాభివృద్ధికి అడుగడుగునా అడ్డుపడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి, తారాచంద్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, సొసైటీ చైర్మన్లు రాంచందర్‌గౌడ్, చింత శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, మాజీ ఎంపీపీలు కంచెట్టి గంగాధర్, చిన్నోల్ల నర్సయ్య, నాయకులు సురేందర్‌రెడ్డి, సేవాలాల్, మహేశ్, మహిపాల్, అంకం నరహరి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పడకల్‌లో దొంగల బీభత్సం

- నాలుగిళ్లలో భారీ చోరీ
- ఏడు తులాల బంగారం, 50 వేల నగదు అపహరణ


అరవింద్ ఇంట్లో దుండగులు పగులగొట్టిన బీరువా

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలంలోని పడకల్ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళాలు వేసి ఉన్న నాలుగు ఇళ్లలో చోరీకి పాల్పడి ఏడు తులాల బంగారు నగలు, 50 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఘటనా స్థలాన్ని డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి శనివారం పరిశీలించారు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రంగు అరవింద్, ఉట్ల నవీన్, సోం నరేశ్, నడుకుడ నర్సు ఇళ్లకు తాళాలు వేసి పనులు, శుభకార్యాల నిమిత్తం ఇతర గ్రామాలకు వెళ్లారు. దుండగులు అర్ధరాత్రి వీరి ఇళ్ల తాళాలు పగులగొట్టి బీరువాల్లో ఉన్న ఏడు తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదును ఎత్తుకెళ్లారు. అద్దెకు ఉండే చాకలి నర్సు ఇంట్లో చొరబడినప్పటికీ ఎలాంటి విలువైన వస్తువులు లేకపోవడంతో తిరిగి వెళ్లిపోతూ సోం శ్రీనివాస్ ఇంటి వద్ద పార్క్ చేసిన బైకును ఎత్తుకెళ్లారు. గ్రామ పొలిమేరలోనే బైక్ పంక్చర్ కావడంతో అక్కడే వదిలేశారు. అనంతరం మళ్లీ గ్రామంలోకి తిరిగి వచ్చిన దుండగులు బడాల నరేశ్ ఇంట్లో ఉన్న పల్సర్ బైక్‌ను దొంగిలించుకొని పారిపోయారు. బైక్‌పై ఆర్మూర్ వైపు వెళుతుండగా అర్గుల్ సమీపంలో పెట్రోల్ అయిపోవడంతో పెట్రోల్ పంపు సమీపంలో సర్వీసు రోడ్డు పక్కన వదిలి వెళ్లిపోయారు. ఘటనా స్థలాన్ని డిచ్‌పల్లి సీఐ మల్లేశ్‌తోపాటు ఫింగర్ ప్రింట్ టీం, సీసీఎస్ పోలీసులు పరిశీలించారు. నాలుగు ఇళ్లలో చోరీకి పాల్పడిన ఇద్దరు దుండగుల దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి.

గుడిలోంచి వెళ్లగొట్టారు..

- రామాలయంలో పూజకు వెళ్లిన మహిళలను బయటికి పంపిన వీడీసీ
- తాళ్లరాంపూర్‌లో ఘటన.. పోలీసులకు ఫిర్యాదు


గుడిలో నుంచి బయటకు వస్తున్న మహిళలు

మోర్తాడ్(బాల్కొండ): దేవుని పూజకు వెళ్లిన మహిళలను వీడీసీ సభ్యులు ఆలయం నుంచి వెళ్లగొట్టిన ఘటన ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. కొన్ని నెలలుగా గ్రామాభివృద్ధి కమిటీకి, గౌడ సంఘం సభ్యులకు మధ్య వివాదం కొనసాగుతోంది. కాగా, శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా శనివారం కుంకుమ పూజను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పూజలో పాల్గొనేందుకు గ్రామానికి చెందిన అనేక మంది మహిళలు మంగళహారతులతో వెళ్లారు. గౌడ సంఘానికి చెందిన మహిళలు కూడా హాజరుకాగా, వారు వెళ్లిపోయేవరకూ పూజా కార్యక్రమం మొదలుపెట్టేది లేదని స్థానిక పురోహితుడి ద్వారా వీడీసీ సభ్యులు చెప్పించారు. మహిళలు అలాగే కూర్చుండగా పూజను ఆరంభించలేదు. చేసేది లేక గౌడ సంఘం మహిళలు గుడి నుంచి వెనుదిరిగారు. గ్రామంలో ఆలయ నిర్మాణం నుంచి ప్రతి ఏటా శ్రీరామనవమికి ముందు నిర్వహించే కుంకుమ పూజలో తాము ఆనవాయితీగా పాల్గొంటున్నామని మహిళలు వెల్లడించారు. వీడీసీకి, గౌడ సంఘానికి మధ్య వివాదం ఉంటే తమను అందులోకి లాగి దేవుని సేవకు దూరం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వీడీసీ సభ్యులపై ఏర్గట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై రాము వెల్లడించారు.

జల్సాలకు అలవాటుపడి చోరీలు

- నిందితుడి అరెస్ట్..బంగారం స్వాధీనం
- ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజశేఖర్

ఖలీల్‌వాడి: జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. మాక్లూర్ మండలం మాదాపూర్ గ్రామంలోని పరుశు దేవానందం ఇంట్లో ఇటీవల చోరీ జరగగా, బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించామన్నారు. మాదాపూర్‌లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి, ఇతర ఆధారాలతో మాణిక్‌బండార్(చెక్క) వద్ద అనుమానాస్పందంగా తిరుగుతున్న మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కార్లకు చెందిన నాందేవ్ ఆనందరావు ముండాకర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

విచారణ అనంతరం పరుశు దేవానందం ఇంట్లో చోరీకి పాల్పడినట్లు నాందేవ్ ఒప్పుకున్నాడని తెలిపారు. నిందితుడి నుంచి 65 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. నిందితుడు గతంలో నందిపేట్ పీఎస్ పరిధిలోని ఐలాపూర్, వెల్మల్ గ్రామాల్లో దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. వెల్మల్‌లో శ్రీనివాస్, అయిలాపూర్‌లో సందీప్ అనే వ్యక్తులతో కలిసి చోరీకి పాల్పడగా, అందుకు సంబంధించి 26 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శ్రీనివాస్, సందీప్‌లు గతంలోనే అరెస్టయినట్లు పేర్కొన్నారు. కాగా, నిందితుడు నాందేవ్ జక్రాన్‌పల్లి, బాల్కొండ, వేల్పూర్ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడి ఆరునెలల క్రితం జైలుకు వెళ్లి మార్చి నెలలో బెయిల్‌పై వచ్చినట్లు తెలిపారు. ఈ నెల 3న మాదాపూర్‌లో దొంగతనం చేసినట్లు చెప్పారు. మొత్తం 91 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకొని, నిందితుడు నాందేవ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వివరించారు. 48 గంటల్లోనే కేసును ఛేదించిన నార్త్ సీఐ శ్రీనివాస్, మాక్లూర్ ఎస్సై రాజశేఖర్, సిబ్బందిని అభినందించారు.

సామిల్‌లో అగ్ని ప్రమాదం

- రెండు దుకాణాల్లో మంటలు
- రూ. 20 లక్షల వరకు ఆస్తినష్టం
- నాలుగు ఫైరింజన్లతో మంటలార్పిన సిబ్బంది


సామిల్స్‌లో చెలరేగుతున్న మంటలు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని పూలాంగ్ చౌరస్తా వద్ద ఉన్న రెండు సామిల్స్‌లో శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగాయి. మొదట శంకర్ సామిల్, సాగ్వాన్ సామిల్‌లో మంటలు అంటుకోగా, పక్కన ఉన్న పద్మారావు సామిల్‌లోకి మంటలు వ్యాపించాయి. రెండు సామిల్స్‌లో మంటలు పెద్ద ఎత్తున ఎగసిపడడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. దట్టమైన పొగలు వ్యాపించడంతో ఫైరింజన్‌కు సమాచారం అందించారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ పర్యవేక్షణలో ఘటనా స్థలానికి నాలుగు ఫైరింజన్లు చేరుకోగా, ఫైర్ ఆఫీసర్ నర్సింగ్‌రావు, సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అదే సమయంలో పెట్రోలింగ్‌కు వెళుతున్న సీపీ పోతరాజు సాయిచైతన్య ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ట్రాఫిక్ ఏసీపీ నారాయణ అక్కడికి చేరుకొని ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా చూశారు. ఈ రెండు సామిల్స్‌లో దుంగలన్నీ కాలిబూడిదకాగా, సుమారు రూ.20 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అధికారులకు యజమానులు తెలిపినట్లు తెలిసింది. ఫైర్ సిబ్బంది సుమన్, కిరణ్‌కుమార్, ప్రశాంత్, సురేందర్, ప్రశాంత్ గౌడ్, సాయిరెడ్డి, సూరజ్ తదితరులు మంటలను ఆర్పారు.

కారులో చెలరేగిన మంటలు

- సురక్షితంగా బయటపడ్డ ప్రయాణికులు


దగ్ధమైన వాహనం

కామారెడ్డి క్రైం: ఓ కుటుంబం ప్రయాణిస్తున్న కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగిన ఘటన కామారెడ్డి సమీపంలోని క్యాసంపల్లి శివారు జాతీయ రహదారిపై శనివారం వేకువజామున చోటు చేసుకుంది. భువనగిరి నుంచి నిజామాబాద్ జిల్లా వర్ని మండలం బడాపహాడ్‌కు ఓ కుటుంబం స్కార్పియోలో వస్తున్నారు. అకస్మాత్తుగా మంటలు వ్యాప్తి చెందడాన్ని గమనించిన డ్రైవర్, వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి అందరినీ కిందికి దింపాడు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని మంటలను ఆర్పారు. అప్పటికే వాహనం పూర్తిగా దగ్ధమైంది.

మహిళ అదృశ్యం

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని అల్మాజీపూర్ గ్రామానికి చెందిన మధుమతి (21) ఈ నెల 4న అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. జంగమాయిపల్లి గ్రామానికి చెందిన మహేందర్‌తో గతేడాది మధుమతికి వివాహమైందని, కుటుంబకలహాలతో ఆమె నాలుగు నెలలుగా అల్మాజీపూర్‌లో ఉంటుందని అన్నారు. ఈ నెల 4న రాత్రి ఇంట్లో అందరూ నిద్రించిన తర్వాత మధుమతి వెళ్లిపోయిందని తెలిపారు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించక పోవడంతో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భార్యపై దాడి చేసిన భర్త

ఎల్లారెడ్డి: కుటుంబకలహాలతో భార్యపై దాడి చేసిన భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. మండలంలోని సోమార్‌పేట్ గ్రామానికి చెందిన రామగల్ల లావణ్యను భర్త శేఖర్ తరుచూ మద్యం తాగి కొట్టేవాడు. ఇదే విషయాన్ని బంధువులకు చెప్పడంతో ఆగ్రహం చెందిన శేఖర్, లావణ్య తలపై కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డీసీఎం వ్యాన్ బోల్తా

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రం శివారులోని 44వ జాతీయ రహదారిపై శనివారం ఓ డీసీఎం వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. వ్యాన్ రాజమండ్రి నుంచి నిజామాబాద్ వైపునకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పింది. వ్యాన్‌లో ఉన్న ఇద్దరు వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. సదాశివనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శిలాఫలకం ధ్వంసం చేసిన వ్యక్తి అరెస్ట్

ఇందల్వాయి: తిర్మన్‌పల్లి గ్రామ శివారులో 33/11 కేవీ నూతన సబ్‌స్టేషన్ నిర్మాణ పనుల శంకుస్థాపన కోసం వేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన కేసులో అదే గ్రామానికి చెందిన మేకల క్రాంతిని అరెస్టు చేసినట్లు ఎస్సై మనోజ్ తెలిపారు. గత గురువారం శిలాఫలకం ధ్వంసమైనట్లు విద్యుత్ శాఖ ఏఈ పండరీనాథ్ ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. నిందితుడిని శనివారం కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడిని పట్టుకున్న పోలీస్ సిబ్బందిని సీఐ మల్లేశ్ అభినందించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పరిధి మాలపల్లిలో పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య శనివారం తెలిపారు. మాలపల్లి నుంచి ఏడు టన్నుల పీడీఎస్ బియ్యంతో వెళుతున్న మినీ వ్యాన్‌ను పట్టుకొని, సుమారు రూ.3 లక్షల విలువచేసే బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాహనంతోపాటు డ్రైవర్ షేక్ ఇమ్రాన్‌ను ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించామన్నారు.